తునికాకు సేకరణ షురూ

- కట్ట ధర రూ.3కు పెంపు
- బేల యూనిట్‌లో 23 కల్లాలు
- వేసవిలో ఉపాధి పొందుతున్న గిరిజనులు


వడగూడలో కట్టలు కడుతున్న గిరిజనులు

బేల: మండలంలోని ఏజెన్సీ పల్లెల్లో తునికాకు సేకరణ ఈనెల 14న ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం 2016న తునికాకు సేకరణ పథకం కింద అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఆకు సేకరణ వేసవిలో చేపడుతుతోంది. వేసవిలో ఖాళీగా లేకుండా గ్రామస్తులు ఆకు సేకరించి, ఉపాధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా.. బేల రేంజ్ యూనిట్ కింద 23 కల్లాల పరిధిలో రూ. 12 లక్షల తునికి ఆకు కట్టల సేకరణ లక్ష్యంగా నిర్ణయించబడింది. ప్రభుత్వ భూముల నుంచి సేకరించిన ఒక ఆకు కట్టకు, పట్టా భూముల నుంచి సేకరించిన ఒక ఆకు కట్టకు వేర్వేరు ధరలు ఉన్నప్పటికీ.. స్థానికంగా ప్రభుత్వ భూముల్లోనే ఈ ఆకు విరివిరిగా లభిస్తోంది. కాగా.. గతేడాది (యాభై ఆకుల) కట్టకు ధర రూ.2.05 ఉండగా, ఈసారి ప్రభుత్వం రూ. 95 పైసల పెంచడంతో ధర రూ. 3కు పెరిగింది. దీంతో కూలీలకు మరింత లబ్ధి చేకూరనుంది.

విరివిగా లభించే ప్రాంతంలో..

ఈఏడాది బేల రేంజ్ యూనిట్ కింద బేల, జైనథ్, నార్నూర్, గాదిగూడ మండలాల పరిధిలో 23 కల్లాలు కేటాయించారు. ఇందులో అటవీకి సమీపన ఆకు అధికంగా విరివిగా లభించే ప్రాంతాలైన కరోని, మశాల, నందిగూడ(బాది), తెలంగ్‌రావు గూడ, బోరిగాం, సోన్‌కాస్, దుబ్బగూడ(ఎం), జున్నపానీ, డొన, ధర్మగూడ, సాంగ్వి(బి), పిప్రి, అడ్మియాన్, అర్జుని, దాబా, ఖండు, కుండి(గుండి), లోకారి(బి), లోకారి(కె), పర్సివాడ, రాంపూర్, రోంఖాస్, ఖడ్కి శివారుల్లో ఆకు సేకరణ కల్లాలను ఏర్పాటు చేశారు.


నందిగూడలో పరిశీలిస్తున్న ఎఫ్‌ఆర్‌వో అరుణ

ఆకు సేకరణ కోసం చిన్న కల్లంకు 25, పెద్ద కల్లంకు 55 మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. తెల్లవారుజామునే గిరిజనులు, ఇతరులు అటవీ ప్రాంతానికి వెళ్లి ఆకు సేకరిస్తున్నారు. రోజుకు 150కిపైగా కట్టలు కడుతున్నారు. ఈక్రమంలోనే కట్టలను కల్లాలలో అరబెడుతున్నారు. దీంతో ఆకు సేకరించిన వారికి రోజూ కూలీ రూ.400కు పైగా పొందుతున్నారు. ఆకు సేకరణ, కట్టలు కట్టడం, అరబెట్టడం 16 నుంచి 21 రోజుల పాటు కొనసాగనుంది.

ఆన్‌లైన్‌లో చెల్లింపులు..

బేల రేంజ్ యూనిట్ పరిధిలోని 23 కల్లాల్లో ఈసారి మొత్తంగా 12 లక్షల ఆకు కట్టల సేకరణ లక్ష్యం పెట్టుకోవడం జరిగింది. ఆకు కట్టల సేకరణ, అరబెట్టడం కోసం చర్యలు తీసుకున్నాం. ఆకులు సేకరించే వారు ఆధార్ కార్డు, ఫొటో, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలను అటవీ శాఖ బీట్ అధికారులకు (ఎఫ్‌బీవో) అందించాలి. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తాం.

– అరుణ, ఎఫ్‌ఆర్‌వో, బేల రేంజ్ అటవీశాఖ

ఈనెల 15 నుంచి కల్లాల్లో ఆకు కట్టల సేకరణ ప్రారంభం కాగా.. ఇప్పటికీ 3లక్షల వరకు ఆకు కట్టల సేకరణ పూర్తయింది. వచ్చే నెల 5వరకు ఆకు సేకరణ కొనసాగనుంది. వ్యవసాయ పనులు లేని సమయంలో ఆకు సేకరణతో ఉపాధి పొందుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

క్లుప్తంగా

కూచిపూడి పరీక్షకు 46 మంది విద్యార్థుల హాజరు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం కూచిపూడి సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన మొదటి, ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం విద్యార్థులకు రాత పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 46 మంది చిన్నారులు హాజరయ్యారు. పరీక్షలను భారతి కళాకేంద్ర విశ్వవిద్యాలయం పర్యవేక్షకులు సచిన్, రవిష్, బాలకేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి, తదితరులు పర్యవేక్షించారు.

'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'


డిక్లరేషన్ ప్రతులను అందజేస్తున్న సాజిద్‌ఖాన్

కైలాస్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి యూత్ డిక్లరేషన్ ప్రతులను ప్రజలకు అందజేశారు. బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, మోతిరాం, సాజిద్, ఫిరోజ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పేదల ప్రభుత్వం

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్ పేదల ప్రభుత్వమని, కూతుళ్ల పెళ్లిల్లకు తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడవద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మర్కగూడ గ్రామాల్లోని వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మహ్మద్ జునైద్, సత్యానంద్, సామాజిక కార్యకర్త రాథోడ్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

తార్కిక ఆలోచనలు పెంపొందించుకోవాలి

కైలాస్‌నగర్: లాజికల్ థింకింగ్‌ని పెంపొందించుకుని ముందుకు సాగాలని రవికిరణ్ యాదవ్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ సైన్స్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. సైన్స్ క్యాంపులో నిర్వహించిన వివిధ యాక్టివిటీలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో రఘు రమణ, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు రమణాచారి, పాఠశాల ప్రిన్సిపాల్ దేవేంద్ర పటాస్కర్, సంతోశ్, రవీందర్, శ్రీధర్ బాబు, శ్రీనివాస్, గంగన్న పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఆదిలాబాద్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే విత్తన డీలర్లపై చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రకళ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని విత్తన దుకాణాలు, గోదాముల్లో రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ తనిఖీ బృందం ఆదివారం తనిఖీలు నిర్వహించారు. రైతులకు పూర్తి వివరాలను కూడిన విత్తనాలు విక్రయించడంతో పాటు రశీదు అందజేయాలన్నారు. ఆమె వెంట టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రమౌళి, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ దుర్గేష్ ఉన్నారు.

రక్తదాన శిబిరం

కైలాస్‌నగర్: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్ రక్తనిధి కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సాయి చరణ్‌గౌడ్, రూపేష్‌రెడ్డి, అఫ్రోజ్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌లో చేరేందుకు యువత ఆసక్తి'

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కోఆప్షన్ సభ్యులు ఎజాజ్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి

నార్నూర్: లంబాడా గిరిజనుల ఆరాధ్యుడు శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ అడుగుజాడలో నడవాలని ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ కోరారు. ఆదివారం మండలంలోని గుండాల గ్రామంలో శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్, జగదాంబదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి జాదవ్ శ్రీరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, రాథోడ్ నారాయణ్, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి


ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు


ఇచ్చోడలో..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భీమన్న, ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు కొత్తూరి లక్ష్మణ్, మజిద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూట రాజేశ్వర్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, సలీం, షేక్ అహ్మద్, సయ్యద్ నిసార్, ముబీన్, వాజిద్ పాల్గొన్నారు.

సన్మానం


కిరణ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామన్న

కైలాస్‌నగర్: పూర్వ ప్రాథమిక విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు, సంస్కృతి ప్రభావం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఇటీవల డాక్టరేట్ పొందిన డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్‌ను ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్న సన్మానించారు. కైలాస్‌నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే పుష్పగుచ్ఛంతో సత్కారించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు దుర్గం శేఖర్, రాంకుమార్, తిరుపతి పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థికి డాక్టరేట్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పాత ఉట్నూర్ గ్రామానికి చెందిన గేడం చంద్రకళ సుభాశ్‌ల కుమారుడు ఆదివాసీ పర్ధాన్ తెగకు చెందిన గేడం శ్రీనివాస్ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు. మాథెమాటిక్స్.. ఒక పరిశోధన అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్‌కు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఆత్రం లక్ష్మణ్, దేవి మడావి లక్ష్మణ్, మెస్రం మనోహర్, ఆడ నగేశ్, కుమ్ర శ్రీనివాస్, కభీర్, శ్రీనివాస్ మడావి, కుమ్ర సాయి కృష్ణ, మనోజ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా కంప్యూటర్ గది



తలమడుగు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డుల నిర్వహణ కోసం కంప్యూటర్ గదిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గదిని ఉపయోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన గదిని ఉపయోగంలోకి తీసుకు రావాలని మండల వాసులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: వనజారెడ్డి, తహసీల్దార్: ఫోన్: 94400 05679

యువత క్రీడల్లో రాణించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న


క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో జేసీ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు ఆదివారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని సరదాగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేలా ఐపీఎల్ తరహాలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష ప్రాధాన్యతనిస్తుందన్నారు. పట్టణంలో క్రీడామైదానాలతో పాటు ఓపెన్ జిమ్ సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జేసీ అకాడమీ నిర్వాహకులు జయేంద్ర పటాస్కర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, రాజు, సంతోశ్, కిషోర్, కరుణాకర్ పాల్గొన్నారు.

శరవేగంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం


కరంజి(టి)లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామానికి గత సంవత్సరం 30 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సర్పంచ్ సాత్విక నరేందర్ యాదవ్ పనులు పర్యవేక్షిస్తుండడంతో వేగవంతంగా, నాణ్యతగా చేపడుతున్నారు. ప్రస్తుతం స్లాబ్ దశతో పాటు 70 శాతం పనులు పూర్తయ్యాయి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతున్నాయి. రెండు రోజులుగా ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆదివారం ఆలయ ప్రాంగణంలో నవగ్రహపూజ, హోమం, విగ్రహానికి జలధివాసం, ధాన్యాధివాసం పూజలు నిర్వహించారు. నేటి ఉదయం వేకువజామున భక్తజనుల సమక్షంలో ఎల్లమ్మ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు మెంచు దత్తు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమ, లస్మన్న, గ్రామస్తులు గంగయ్య, వైభవ్, నితిన్ పాల్గొన్నారు.

దత్త విగ్రహ ప్రతిష్ఠాపన

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మాన్నూర్‌లో ఆదివారం దత్త విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారాం, నరాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన విజయవంతం చేయండి


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: కొత్తగూడెంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4న నిర్వహిస్తున్న ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముగుపు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ఉపాధి, ఉద్యోగాల కల్పనపై చర్చించడం జరుగుతుందన్నారు. అలాగే భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, మెస్రం భాస్కర్, అరుణ్‌కుమార్, అమీనా బేగం, కృష్ణవేణి, సురేశ్ పాల్గొన్నారు.

6,222 దరఖాస్తులు.. 222 యూనిట్లు

- ఆరేళ్ల తర్వాత మైనార్టీలకు సబ్సిడీ రుణాలు
- రెండు కేటగిరీల్లో మంజూరుకు ప్రణాళిక


జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు గతంలో ప్రభుత్వాలు రుణాలు అందజేసేవి. కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, అర్హులైన లబ్ధిదారులకు బ్యాంక్ లింకేజీ రుణాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే కొన్నేళ్లుగా రాష్ట్రంలో పలు శాఖలకు సంబంధించిన సబ్సిడీ రుణాలు నిలిచిపోయాయి. దీంతో మైనార్టీ కార్పొరేషన్ నుంచి నిరుద్యోగ యువతకు ఎలాంటి సాయం అందకపోగా.. గత ఏడాది డిసెంబర్‌లో సబ్సిడీ రుణాల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో వారిలో కొంత ఆశలు చిగురించాయి.

2015– 16లో చివరి సారి..

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు బ్యాంక్ లింకేజీ సబ్సిడీ రుణాలు అందించేది. ఈపథకం ద్వారా ఏటా వంద మందికి పైగా రుణాలు పొంది యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. చివరిసారి 2015– 16 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 22 యూనిట్లు మంజూరు కాగా.. రూ. 4.40లక్షలు మంజూరు చేశారు. అందులో రెండు యూనిట్లను అర్హులుగా గుర్తించారు. మరొక్కరు రూ. 20వేల యూనిట్‌ను తీసుకునేందుకు నిరాకరించారు. అయితే 19 మంది లబ్ధిదారులకు రూ. 3.80 లక్షలు అందజేశారు. అప్పటి నుంచి రుణాలు జాడ లేకుండా పోయాయి.


అత్యధిక దరఖాస్తులు..

సబ్సిడీ రుణాల కోసం లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 6,222 మంది వివిధ రుణాలను కోసం దరఖాస్తు చేసుకోగా.. 222 యూనిట్లు మాత్రమే జిల్లాకు కేటాయించింది. వీటిలో ముస్లింలు, సిక్కులు, పార్సిలు, బౌద్ధులు, జైనులు వివిధ యూనిట్లకు దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారులు ఎక్కువగా ఉండడంతో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. యూనిట్లు మంజూరు కానీ లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెండు కేటగిరీలో రుణాలు..

మైనార్టీలకు సబ్సిడీ రుణాలను ప్రభుత్వం రెండు కేటగిరీలో ఇవ్వనుంది. కేటగిరీ 1 కింద యూనిట్ విలువ రూ. లక్ష వరకు ఉంటే అందులో 80 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. మిగతా నగదు బ్యాంక్ రుణంగా లేదా లబ్ధిదారుడు చెల్లించాలి. కేటగిరీ 2 కింద యూనిట్ విలువ రూ. 2 లక్షల వరకు ఉంటే 70 శాతం సబ్సిడీ వర్తించనుంది. ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఉత్తర్వులతో జిల్లాలో 222 యూనిట్లను కేటాయించింది. ఇందులో కేటగిరీ 1లో 156 యూనిట్లు రూ. 12.48 కోట్లు, కేటగిరీ 2లో 66 మంది లబ్ధిదారులకు రూ. 92.40 లక్షలను మంజూరు చేసింది.

మున్సిపాలిటీ జాబితా రాలేదు



మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు రెండు కేటగిరీల్లో రుణాలు అందజేయనున్నాం. కేటగిరీ 1, 2లో అందజేస్తాం. మండలాల నుంచి లబ్ధిదారుల జాబితా వచ్చింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక వివరాలు రావాల్సి ఉంది. యూనిట్లు మంజూరైన వారికి నేరుగా వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

– కృష్ణవేణి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి

గిరి గ్రామాల్లో తాగునీటి కష్టాలు


మామిడిగూడలో బోరు వద్ద గిరిజనులు


నీటిని తీసుకెళ్తున్న గిరిజనులు

ఇంద్రవెల్లి: మండలంలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి కష్టాలు వెంటడుతున్నాయి. ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ నీరు అందిస్తున్నామని అధికారులు గొప్పగా చెబుకుంటున్నా.. ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. భూగర్భ జలాలు అడుగంటిపోయి గ్రామాల్లో నీటి పథకాలు పని చేయకపోవడంతో ప్రజలు వ్యవసాయ బావులు, బోరు బావుల నీటిపై ఆధారపడుతున్నారు. మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడలో నెల రోజులుగా భగీరథ నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దోడంద, గట్టేపల్లి, కోలంగూడలో సర్పంచులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.


దోడందలో ట్యాంకర్ నీటిని పట్టుకున్న ప్రజలు

'గ్రామాల అభివృద్ధే ధ్యేయం'


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

జైనథ్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డిలు అన్నారు. ఆదివారం మండలంలోని సాంగ్వి(కె) గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్‌లు, కమ్యూనిటీ భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విఠల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.